క్లుప్తంగా

గ్రామాల్లో నిఘా ఉంచాలి



శావల్యాపురం: గ్రామాల్లో చోటుచేసుకునే ఘటనలపై గ్రామ సచివాలయ మహిళా పోలీసులు నిఘా ఉంచాలని ఎస్ఐ చల్లా సురేష్ పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషనులో గ్రామ సచివాలయ మహిళా పోలీసులకు శాంతి భద్రతలపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు ప్రతి సోమవారం గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో శాంతి భద్రతలు అసాంఘిక కార్యాకలాపాలపై తదితరవాటిపై సమీక్షించి అనంతరం మహిళా పోలీసులకు దిశ నిర్దేశం చేశామన్నారు.

భావనారుషి ఆలయ ప్రాంగణంలో శాంతిహోమాలు

నాదెండ్ల: గణపవరం పద్మశాలీపేటలో నూతనంగా పూర్తి రాతితో నిర్మిస్తున్న భద్రావతి సమేత భావనారుషి ఆలయం పైకప్పు నిర్మాణ పనులు సోమవారం పూర్తిచేశారు. ముందుగా పైకప్పు రాయిని జాతీయ రహదారి నుండి ఆలయం వరకు సంప్రదాయ మేళాతాళాలు, సన్నాయి, చిన్నారుల కోలాట ప్రదర్శనతో ఆలయం వద్దకు చేర్చారు. వేదపండితులు కె.భోగేశ్వరశర్మ, సీహెచ్ రాజీవ్‌శర్మ, సీహెచ్ రాజేశ్వరశాస్త్రి, సీహెచ్ అప్పయ్యశర్మ, పేరయ శాస్త్రి బృందం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శాంతిహోమాలు నిర్వహించారు. గతేడాది అక్టోబర్ 22న ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. సుమారు 6 సెంట్ల స్థలాన్ని గ్రామానికి చెందిన గాత్రం నాగయ్య కుమారులు భగవత్‌సింగ్, వీరయ్య దానం చేశారు. రూ.25 లక్షలతో నిర్మాణ పనులు సాగుతున్నాయి. అక్టోబర్ నాటికి నిర్మాణ పనులు పూర్తి కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

పశువులకు వైద్య శిబిరం



చిలకలూరిపేట: మండలంలోని పసుమర్రులోని పశువైద్యశాలలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో గేదెలు, ఆవులకు గర్భకోశ వ్యాధుల చికిత్స వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ పి.దీప్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 52 పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించి, మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. 33 దూడలకు నట్టల నివారణ మందు అందజేశారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, డీఎల్‌డీఏ డాక్టర్ బాలశంకర్, నరసరావుపేట ఏడీ డాక్టర్ నరసింహులు, చిలకలూరిపేట ఏడీ డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ బెన్ని పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



శావల్యాపురం: జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ కోరారు. మండలంలోని వేల్పూరులో వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో జ్వరాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటింటికి సర్వే చేయించి సేవలు అందించినట్లు చెప్పారు. శానిటేషన్ పనులు సత్వరమే చేయకపోతే భవిష్యత్‌లో అంటువ్యాధులు ప్రబలతాయని హెచ్చరించారు. శిబిరంలో 150 మందికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఎస్సీ కాలనీలో పది మంది జ్వర పీడితులను గుర్తించినట్లు చెప్పారు. శిబిరంలో సీహెచ్‌ఓ వెంకటయ్య, సూపర్‌వైజరు ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు అమరలింగేశ్వరి, విజయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు శ్యామలత, మాధురి పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు



నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం శ్రావణ మాస తొలిరోజు పూజలు నిర్వహించారు. గీతా సమాజం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కొల్లా హేమంత్, కృష్ణతారకం దంపతులు అమ్మవారికి వెండి ఆభరణాలు ఆలయ ధర్మకర్తలు అనుమంచి శరవణ్ కుమార్, పూజారి చంద్రశేఖర్‌లకు అందజేశారు. అనంతరం గీతాసమాజం వారితో గీతపారాయణం నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలి

డీడీఏ శివకుమారి



సదస్సులో మాట్లాడుతున్న డీడీఏ శివకుమారి

శావల్యాపురం: ఈ ఖరీఫ్ సీజన్ రైతులు ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం డీడీఏ మద్దినేని శివ కుమారి కోరారు. మండలంలోని వేల్పూరు గ్రామం రైతుభరోసా కేంద్రంలో రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. శివకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం రైతులకు ప్రభుత్వపరంగా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని, ఈవిధంగా పంటలు సాగు రైతులకు బహిరంగ మార్కెటులో పంటలకు అధిక ధరలు వర్తించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ విధానం వలన పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని చెప్పారు. భూసార పరీక్షలు ఆధారంగా పశువుల ఎరువులు, పచ్చరొట్టె ఎరువులు, జీవన ఎరువులు వాడుకోవాలన్నారు. రసాయనిక ఎరువులు వినియోగించరాదని సూచించారు. వరి పంటలో యజమాన్య పద్ధతులు గురించి వివరించారు. విత్తన శుద్ధి తదతర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో సర్పంచి బీర్నేడి రత్నగిరి, జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతి, జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏఓ పల్లపోతుల ప్రవీణ్, మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, ఏఈఓ పురేటి అశోక్ పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక చేయూత అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం నేతలు

శావల్యాపురం: మండలంలోని కారుమంచికు చెందిన బ్రాహ్మణ కుటుంబానికి నియోజకవర్గ బ్రాహ్మణ పెద్దలు ఆర్థిక సాయం అందించారు. వివరాలు.. గ్రామానికి చెందిన శివాలయం అర్చకులు పేటేటి నాగ శ్రీరామమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. తల్లి, దివ్యాంగురాలైన చెల్లి, మేనకోడలు నిలువ నీడ లేక రోడ్డుపై పడ్డారు. ఇంటి పెద్ద చనిపోవటం చేత అనాథ కాగా చిన్నపాటి టెంటు వేసుకొని ఉంటున్నారు. సోమవారం ఈవిషయం తెలుసుకున్న వినుకొండ పట్టణ కౌన్సిలర్ పీవీ సురేష్‌బాబు, నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం నేతలు తదితరులు నిరుపేద కుటుంబాన్ని పరామర్శించారు. దివ్యాంగులు సోదరి నాగకోమలి, 7వ తరగతి చదువుతున్న చిరంజీవి షణ్ముగ సాయి ఆస్మితను తమ పాఠశాల్లో 10వ తరగతి వరకు ఉచిత విద్యతో పాటు భోజన వసతి కల్పిస్తామని శర్మ హామీ ఇచ్చారు. అలాగే బ్రాహ్మణ కుటుంబానికి ఆర్థికంగా రూ.25 వేలు అందజేసి ఉండటానికి షెడ్డు నిర్మిస్తామన్నారు. గ్రామస్తులు సహకారంతో పాటు తమవంతు ఆర్థిక చేయూత అందజేయాలన్నారు. కార్యక్రమంలో మంత్రిరాజు సత్యనారాయణ, గాలి శ్రీనివాసరావు, అపరాజు నాగేశ్వరరావు, భాగవతుల రవికుమార్, యడవల్లి శ్రీనివాసశర్మ, ముటుకుల శివకుమార్ పాల్గొన్నారు.

డయేరియా, డెంగీ, సీజనల్ వ్యాధులపై అవగాహన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డెంగీ, మలేరియా, డయేరియా, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జలజీవన్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ జయ జయ సంగీత్ మాట్లాడుతూ భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన డయేరియా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు, సీజనల్ వ్యాధులు రావని అన్నారు. హెల్త్ సూపర్ వైజర్ రామయ్య అతిసార వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు గురించి వివరించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బియ్యం సుభానీ, స్వచ్ఛ భారత్ హెచ్ ఆర్డి కన్సల్టెంట్ రమేష్, ఇన్‌చార్జి సర్పంచి పడాల చక్రారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఎం.ఆర్.సి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రమాద మృతులకు నివాళి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

రొంపిచర్ల: చేతికందిన బిడ్డలు అర్ధాంతరంగా తనువు చాలిస్తే ఆ తల్లిదండ్రుల కడుపుకోత భరించలేనిదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. మండలంలోని విప్పర్లలో ఆయన సోమవారం పర్యటించారు. హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రోహిత్, బాలప్రసన్న మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు ఇమ్మడిశెట్టి కాశయ్య, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శేషమ్మ పాల్గొన్నారు.

మృతుల అవయవాలు దానం..

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రోహిత్, బాలప్రసన్న అవయవాలను వారి తల్లిదండ్రులు దానం చేశారు. ఎల్.వి.ప్రసాద్ కంటి వైద్యశాలకు వారి ఇరువురి కళ్లను అందజేసినట్లు మృతుల బంధువులు తెలిపారు.

విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయాలి

- పాటిబండ్ల ఆర్‌సీఎం పాఠశాలను సందర్శించిన విద్యా శాఖ ఆర్‌జేడీ
- విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు



విద్యార్థి సామర్థ్యం పరిశీలిస్తున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

పెదకూరపాడు: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారి సామర్థ్యం పెంచేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి కోరారు. మండలంలోని పాటిబండ్ల ఆర్‌సీఎం పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేసి వారాంతర పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబర్చని విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించాలన్నారు. విద్యార్థుల హాజరును యాప్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి పాఠశాలలో అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంఈవో–2 సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కుండపోత వర్షం



మండల కేంద్రమైన రొంపిచర్లతో పాటు పరిసర గ్రామాల్లో సోమవారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. నాలుగు రోజులుగా ఉక్కపోతగా ఉన్న వాతావరణం ఈ వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. కుండపోత వర్షంతో గ్రామాల్లోని రోడ్లపై నీరు ప్రవహించింది. ఉధృతంగా వర్షం కురిసినంత సేపూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సాగర్ కాలువకు సాగు నీరు విడుదల చేయటంతోపాటు వర్షం కూడా కురియటంతో మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరం కానున్నాయి. –రొంపిచర్ల

తహసీల్దార్‌గా వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరణ



నరసరావుపేట టౌన్: నరసరావుపేట తహసీల్దార్‌గా కొనికినేని వేణుగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీసీఎల్ఏ విభాగంలో తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ప్రజలకు అందే సేవల్లో అలసత్వం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం వచ్చే ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్ ఉండదని చెప్పారు. మండలంలోని పసుమర్రు, మానుకొండవారిపాలెం, గొట్టిపాడు, మిట్టపాలెం, నాగభైరువారిపాలెం, కుక్కపల్లివారిపాలెం గ్రామాలకు చెందిన వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంపీపీ స్కూలు తనిఖీ

శావల్యాపురం: మండలంలోని తుమ్మలకుంటలోని ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ పుసులూరి లలితాకుమారి సోమవారం తనిఖీ చేశారు. పాఠశాల్లో విద్యార్థుల సామర్థ్యాలతో పాటు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిళ్ల రాజా రమేష్ ఉన్నారు.

9 నుంచి క్రీడా, సాంస్కృతిక వేడుకలు



చిలకలూరిపేట: ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న క్రీడా, సాంస్కృతిక వేడుకలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో క్రీడా, సాంస్కృతిక వేడుకల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు అరెస్ట్

నరసరావుపేట టౌన్: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ విజయ్ చరణ్ సోమవారం తెలిపారు. గడియారస్తంభం సెంటర్‌లో పట్టణానికి చెందిన కొల్లిపర నాగరాజు, కొల్లిపర సాయికుమార్ మద్యం తాగి మరో వ్యక్తితో గొడవ పడుతున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.ఫణిరాజు అక్కడకు చేరుకొని గొడవ చేయవద్దని వారించాడు. దీంతో అతడిపై దురుసుగా ప్రవర్తించటంతో పాటు దుర్భాషలాడారు. ఈ మేరకు ఫణిరాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా రిమాండ్ విధించటంతో సబ్‌జైలుకు తరలించారు.

భజన మండలి సమ్మేళన కరపత్రాలు విడుదల



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విజయకుమార్

నరసరావుపేట: పట్టణంలో విశ్వహిందూ మహాసంగభారత్ నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు ఒకటో తేదీ ప్రకాష్‌నగర్ టౌన్‌హాలు ప్రాంగణంలో నిర్వహించే పల్నాడు జిల్లాస్థాయి హైందవ ధర్మ భజన మండలి సమ్మేళన కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. భక్తి గీతాలలో పాల్గొనే జిల్లా స్థాయి భజన మండలి వారు ఈనెల 25లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు చేగు వెంకటేశ్వరరావు 92464 53348, యక్కల సుజాత 98492 50575, మురారి శెట్టి పద్మావతి 98481 47744, తాటికొండ కుమారి వాణి 98495 43056లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ మహాసంగభారత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చేగు వెంకటేశ్వరరావు, రైస్ మిల్లర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పూరా భాస్కరరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ నరసరావుపేట అధ్యక్షులు వనమా సాంబశివరావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు బత్తుల మురళి పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన ఉండాలి



కార్యక్రమంలోపాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది



కర్లకుంట అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ షమీమ్ సుల్తాన్

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని నరగాయపాలెం సెక్టార్ పరిధిలోని చీకటీగలపాలెంలో తల్లిపాల వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎం.నాగరాజు కుమారి మాట్లాడుతూ తల్లిపాలు దేవుడిచ్చిన వరం అని పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన ఒక గంటలో ముర్రుపాలు తాగించాలని, వాటి వలన బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి లభిస్తుందన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచి బి.కోటిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఈ.వెంకటరెడ్డి, హెచ్‌ఎం టి.పద్మావతి, కె.విజయ పాల్గొన్నారు.

మునగ ఆకుతో అధిక ప్రయోజనాలు

రొంపిచర్ల: మండలంలోని మునమాక, కర్లకుంట గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డి.దేవీబాయి మునగ ఆకు గురించి వివరించారు. అలాగే మునగ ఆకుతో తయారు చేసిన పదార్థాలు తినడం వల్ల వనగూరే ప్రయోజనాల గురించి వివరించారు. అలాగే కర్లకుంట గ్రామంలో నిర్వహించిన వారోత్సవాల్లో సూపర్‌వైజర్ షమీమ్ సుల్తాన్ మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు సులభంగా జీర్ణమవుతాయన్నారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో ఏఎన్ఎం జ్యోతి, హెల్త్‌సూపర్‌వైజర్ రామయ్య, నాగలక్ష్మి, రేవతి, షన్మాజీ బేగం పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఎంతో ఆవశ్యం

నాదెండ్ల: బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకూ కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, ఆపై పోషకాలతో కూడిన ఘనాహారంతో పాటూ తల్లిపాలు ఇవ్వాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.పద్మ, ఉష చెప్పారు. చిరుమామిళ్ల, చందవరం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాలు కొనసాగిద్దామంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

శిశువుకు తొలిపోషణ తల్లిపాలే...

యడ్లపాడు: తల్లిపాలు శిశువుకు తొలి పోషణ అని.. బిడ్డకు ఆర్నెలల పాటు తల్లిపాలే ఇవ్వాలని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ పేర్కొన్నారు. ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాడు వారోత్సవాలు నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చెందిన అధికారులు పాల్గొన్నారు. తొలుత స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీని తహసీల్దార్ విజయశ్రీ ప్రారంభించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఫ్లెక్సీ, ప్లకార్డులు పట్టుకుని తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ బి.నిర్మల రాణి, ఎంఈఓ ఎం.నాగరత్నం, ఈఓపీఆర్డీ డి.వరూధిని, ఐసీడీఎస్ యడ్లపాడు, వంకాయలపాడు, సొలస సెక్టార్ల సూపర్‌వైజర్లు టి.వెంకటరమణ, టి.పార్వతి, ఎం.జోజమ్మ పాల్గొన్నారు.

న్యాయవాదులపై అక్రమ కేసులకు నిరసన

నరసరావుపేట టౌన్: న్యాయవాదులపై అక్రమ కేసులు బనాయించటాన్ని నిరసిస్తూ సోమవారం న్యాయవాదులు విధులకు గైర్హాజరయ్యారు. గుంటూరు, మంగళగిరిలకు చెందిన న్యాయవాదులు నాగరాజు, గవాస్కర్‌లపై అక్రమ కేసు పెట్టడాన్ని నిరసిస్తూ రాష్ట్ర న్యాయవాద సంఘం పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా నరసరావుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులకు గైర్హాజరై తమ నిరసన తెలిపారు.

న్యాయవాదులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

చిలకలూరిపేట: న్యాయవాదులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భాగ్యారావు కోరారు. గుంటూరులోని పట్టాభిపురం, మంగళగిరి పోలీస్‌స్టేషన్లలో ఇరువురు న్యాయవాదులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాదులపై కేసులు నమోదు చేయడమంటే రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించివేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి.వీరయ్య, ఉపాధ్యక్షుడు బి.రాజేష్ ఉన్నారు.

జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో గ్రామ సభ



గ్రామ సభలో మాట్లాడుతున్న జలజీవన్ మిషన్ కో–ఆర్డినేటర్ రంగారావు

రొంపిచర్ల: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. జిల్లా కో–ఆర్డినేటర్ టి.రంగారావు మాట్లాడుతూ సురక్షితమైన తాగునీటిని అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యమన్నారు. గ్రామాలలో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి ద్వారా సురక్షిత మైన 55 లీటర్ల తాగునీరు అందించడం జలజీవన్ మిషన్ ఉద్దేశమని చెప్పారు. గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సంరక్షణ కేంద్రాలకు ఉచితంగా తాగునీటిని అందించనున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా గ్రామాలలో అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు నీటి వనరులను పెంపొందించడం, అదనపు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టానికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. కార్యక్రమం పూర్తిగా గ్రామ తాగునీటి, పారిశుద్ధ్య కమిటీ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి టి.జయమ్మ, ఉప సర్పంచి పడాల చక్రారెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, జలజీవన్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ తేజ్ సంగీత్, స్వచ్ఛ భారత్ జిల్లా కో–ఆర్డినేటర్ రమేష్, మండల కో–ఆర్డినేటర్ మేడికొండ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పత్తిలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

ముప్పాళ్ల: వర్షానికి దెబ్బతిన్న పత్తి పంటలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. సోమవారం మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని పత్తి పొలాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ముందుగా పొలంలో గొర్రు, గుంటకతో కలుపు యాజమాన్య పద్ధతులు చేపట్టాలన్నారు. 40 రోజులు పైబడిన పైరులో మెగ్నీషియం లోపంతో ఆకులు అక్కడక్కడ ఎర్రగా మారుతున్నాయని, నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ ఎకరాకు 2 కిలోల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రసం పీల్చు పురుగు నివారణకు ఎసిఫేట్ 350 గ్రాములు లేదా ఏసిటామిప్రిడ్ లేదా థైయోమిథాక్సమ్ 40 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పది రోజులకు మందులను మార్చుతూ పిచికారీ చేయాలన్నారు. పత్తి పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న కంచె పంటగా 2–3 వరసలు నాటినట్లయితే రసం పీల్చే పురుగులు ఆశించవన్నారు. ఎకరాకు 10 ఆముదపు మొక్కలు నాటినట్లయితే పొగాకు లద్దెపురుగు నియంత్రించుకోవచ్చన్నారు. కంది పంటను పత్తి పంటలో 5–6 వరుసలకు ఒక వరుస నాటినట్లయితే మిత్ర పురుగుల సంతతి పెంచవచ్చన్నారు. వీఏఏ పావని, రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా ఆలయ విశ్రాంతి భవన నిర్మాణ పనులు



గుడి వద్ద విశ్రాంతి భవనం స్లాబు పనులు పూర్తి చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: భక్తుల సౌకర్యార్థం చేపట్టిన విశ్రాంతి భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని మైదవోలు గ్రామంలోని పోలేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద నిర్మాణంలో భవనం రెండో అంతస్తు స్లాబు పనులు సోమవారం పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రూ.10 లక్షల అంచనాలతో ప్రారంభించిన ఈ పనులకు దాతలు సహకారం అందించగా, మిగిలిన డబ్బుల్ని మాజీ సర్పంచి నక్కా కోటేశ్వరరావు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే మిగిలిన పనుల్ని వేగవంతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అశోక్‌కుమార్, పోతురాజు, సురువేశ్వరరావు, కె సుబ్బారావు ఉన్నారు.